"ఉత్తిష్ఠత!జాగ్రత! ప్రాప్యవరాన్నిబోధత"
కలియుగాబ్ది 5120

మాసపత్రిక

# హిందూనగారా

సంపుటి : 27 ❁ సంచిక : 3 ❁ పేజీలు : 8 ❁ విడిప్రతి : రూ.5.00 ❁ వికంబినామసంవత్సరం : ఫాల్గుణ మాసం : 01-03-2019


## భారత మీడియా పాక్ చేతిలో పావుగా మారిందా?

**భా**రత మీడియా పాక్ చేతిలో పావుగా మారిందా? అందుకే హైందవేతరులు, దళితులపై జరిగే దాడులను గోరంతలు కొండంతలుగా చూపిస్తోందా? సైనికులు, హిందువుల ప్రాణాలు పోతున్నా లైట్ తీసుకుంటోందా? ఇప్పుడు తాజాగా వెల్లడైన 2016 పాకిస్థాన్ సెనేట్ మీటింగ్ యొక్క వివరాలను పరిశీలిస్తే అవుననే అనిపిస్తోంది.

పొరుగు దేశం పాకిస్థాన్ మన దేశంలో ప్రస్తుత ప్రభుత్వాన్ని అస్థిర పరచటానికి తెలివిగా ఒక సరికొత్త పథకాన్ని రచించింది.

దేశంలో ఎక్కడైనా ఒక చిన్న సంఘటన జరిగితే మన దేశంలోని సెక్యులర్ మీడియా ఆ ఘటనను పెద్దదిగా చేసి చూపిస్తోంది. దళితులు, ముస్లింలు మరియు క్రైస్తవుల పైన ఏదైనా ఒక చిన్న దుర్ఘటన జరిగితే వెంటనే దానిని ఆ వర్గాల మీద అత్యాచారాలుగా చూపిస్తూ గగ్గోలు పెడుతోంది. దర్యాప్తుకు ముందే కేంద్ర ప్రభుత్వాన్ని దోషిగా చూపిస్తూ నానా హంగామా సృష్టిస్తోంది. అందుకు కారణం ఏమిటో తెలుసా? పాకిస్థాన్ కుట్ర. అవును మీరు చదివింది నిజమే. మన మీడియా పాకిస్థాన్ చేతిలో కీలు బొమ్మగా మారింది. ఈ మొత్తం వ్యవహారంలో పాకిస్థాన్ యొక్క మాస్టర్ ప్లాన్ 2016 దాగివుంది.

ఉదాహరణకు కులభూషణ్ వ్యవహారమే తీసుకుంటే హేగ్ లోని అంతర్జాతీయ న్యాయస్థానంలో భారతీయుడైన కులభూషణ్ యాదవ్ కేసు విచారణ జరుగుతోంది. కులభూషణ్ తమ దేశంలో గూఢచర్య కార్యకలాపాలకు పాల్పడ్డాడని ఆరోపిస్తున్న పాకిస్థాన్ అతనికి ఉరి శిక్ష విధించింది. దీనిని సవాలు చేస్తూ భారత్ దాఖలు చేసిన అప్పీల్ పై న్యాయస్థానంలో వాదోపవాదాలు జరుగుతున్నాయి. అయితే కులభూషణ్ పై నేరారోపణ చేసేందుకు వీలుగా భారతీయ మీడియాలోనే కథనాలు సృష్టించింది పాక్. 2017లో ఇండియన్ ఎక్స్ ప్రెస్ లో కరణ్ థాపర్ వ్రాసిన వ్యాసం, 2018లో ప్రవీణ్ శర్మ ఫ్రంట్ లైన్ కథనం, క్వింట్ లో చందన్


"POLICY GUIDELINES IN VIEW OF THE LATEST SITUATION DEVELOPING BETWEEN INDIA AND PAKISTAN"

House of the Federation

First Report
Committee of the Whole

Senate of Pakistan
(October-2016)

నంది కథనాలను ఇప్పుడు సాక్ష్యంగా చూపిస్తోంది పాకిస్థాన్. పాకిస్థాన్ కుట్రలో ఇది కూడా ఒక భాగం.

పాకిస్థాన్ 2016 కుట్ర ఏమిటో ఇప్పుడు చూద్దాం. దీనిని 2016లో పాకిస్థాన్ ఎగువ సభకు చెందిన కమిటీ ఒకటి రచించింది. విధాన మార్గదర్శక ప్రణాళిక తయారీలో పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా మహమ్మద్ ఆసిఫ్, రక్షణ కార్యదర్శి, ప్రధాని సలహాదారు సర్తాజ్ అజీజ్ తో పాటు 13మంది ఎంపి లు పాల్గొన్నారు. దీనిని 4 అక్టోబర్ , 2016లో ఆమోదించారు. పాకిస్థాన్ పట్ల కఠినమైన వైఖరిఅవలంబిస్తున్న మోదీని తొలగించడానికి లేదా ఎదుర్కోవడానికి అమలు చేయాల్సిన 22 సూత్రాల ప్రణాళికను ఈ కమిటీ తయారుచేసింది. కాశ్మీర్ విషయమై భారత్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ వేదికలపై ప్రచారం సాగించడం కోసం అక్కడ మానవహక్కుల ఉల్లంఘన జరిగిపోతోందంటూ పదేపదే ఆరోపణలు చేయాలని ఆ కమిటీ సూచించింది. ఈ ప్రణాళిక చాలా ప్రమాదకరమైనది. సమాజంలో విభేదాలు సృష్టించడం ఇందులో ప్రధాన అంశం. అంటే జాతి, మతం మొదలైన వాటి ఆధారంగా ఘర్షణలు సృష్టించడం. హిందూత్వం, ఆరెస్సెస్ పేరు చెప్పి క్రైస్తవులు, ముస్లిములు, దళితుల్లో భయాందోళనలు కలిగించడం. దీని కోసం మోదీ వ్యతిరేక మీడియా, మానవహక్కులసంఘాలు, రాజకీయపార్టీల సహకారం తీసుకోవాలన్నది ఆ ప్రణాళికలో భాగం. ఈ ప్రణాళికను పాకిస్థాన్ ఇప్పటికే అమలులో పెట్టినట్లు కనిపిస్తోంది. క్రైస్తవులు, ముస్లింలు, దళితుల పై దాడులు జరిపి, అవన్నీ మోదీ ప్రభుత్వం వల్లనే జరుగుతున్నాయని చిత్రీకరించే ప్రయత్నం ఇప్పటికే సాగుతున్నట్లు తెలుస్తోంది. ఆయా వర్గాలలో హిందూత్వం, ఆరెస్సెస్ పట్ల తీవ్ర వ్యతిరేకత కలిగించడానికి ప్రయత్నం జరుగుతోంది. ఏదో చిన్న సంఘటనను ఆధారం చేసుకుని మీడియా, మేధావి వర్గం, కొన్ని పార్టీలు హిందూత్వం, ఆర్ ఎస్ ఎస్ కు వ్యతిరేకంగా ఎందుకు దుష్ప్రచారం చేస్తున్నాయో ఇప్పుడు అర్థమవుతుంది. తన కుట్రపూరిత ప్రణాళికను అమలులో పెట్టే పనిని పాకిస్థాన్ అంతర్జాతీయ సంస్థలకు అప్పగించింది. అలా ఏ సంస్థల ద్వారా పని జరిపించాలన్నది కూడా ఎంపీ కమిటీ నిర్ధారించింది. పాకిస్థాన్ సెనేట్ కమిటీ రిపోర్ట్ ప్రకారం సాగుతున్న ఈ కుట్ర వివరాలు ఇప్పుడు క్రమంగా సామాన్య ప్రజానీకానికి కూడా అర్థమవుతున్నాయి. దేశంలో చిన్నచిన్న కారణాలకే పెద్ద ఆందోళనలు ఎందుకు జరుగుతున్నాయో తెలుస్తోంది. ఎవరి కోసం దేశంలో కొందరు ఈ ఆందోళనలు చేస్తున్నారో స్పష్టమవుతోంది.

★

# యావద్దేశం ఒక్కటిగా... అమరవీరులకు వెన్నుదన్నుగా...

ఫిబ్రవరి 14, 2019 జమ్ము కాశ్మీర్‌లోని పుల్వామా వద్ద సైనికుల కాన్వాయ్‌పై జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన ఉగ్ర వాదుల ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు వీరమరణం పొందారు. భారతదేశ చరిత్రలో ఆరోజు అత్యంత చీకటి రోజు. గత నాలుగున్నర సంవత్సరాలుగా దేశంలో ఉగ్రదాడులు తగ్గాయని, కాశ్మీర్ ప్రాంతంలో రాళ్ళు విసిరే గ్యాంగుల ఆగడాలు తగ్గుముఖం పట్టాయని యావజ్జాతి ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో ఈ హఠాత్ సంఘటన అశనిపాతమైంది. పాలకుల దగ్గర నుంచి సామాన్య ప్రజల వరకూ అందరి హృదయాలూ కుతకుతలాడి పోయాయ్. ప్రతీకారేచ్ఛతో రగులు తున్నాయి. తీవ్రమైన ప్రతి చర్యతో కుట్రదారులకు, నిత్యం దేశంలో రేగుతున్న అశాంతికి కారకులైన వారికి తగిన బుద్ధి చెప్పాలని దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

అదే సమయంలో దేశరక్షణకై అశువులు బాసిన వీర జవాన్లకు ఘన నివాళి తెలుపడానికి, వారి కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలవడానికి యావజ్జాతి కదలి రావడం హర్షణీయం. యావద్దేశమూ జరిగిన దుస్సంఘటనపై తన ఆవేదనను, ఆక్రోశాన్ని వెళ్లగక్కుతోంది.

అన్నిటికంటే కొత్త విషయం, అమర జవాన్ల పార్థివ దేహాల్ని సాక్షాత్తూ కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్వయంగా మోయడం. ఇది నిజంగా అమర వీరుల పట్ల ఆయనకున్న గౌరవానికి నిదర్శనం.

పుల్వామా ఘటనలో పాక్ పాత్రపై ప్రపంచ వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఏకాకిగా మారిన పాక్ సైతం ఆచితూచి వ్యవహరిస్తుంటే మమతా బెనర్జీ, చంద్రబాబు వంటి సీనియర్ రాజకీయ నాయకులు మాత్రం శత్రు దేశం పాకిస్థాన్ వాదనకు బలం చేకూర్చే విధంగా సరిగ్గా పాక్ ప్రధాని వాదననే వినిపిస్తూ ఉండడం బాధాకరం. వారి చర్య ముమ్మాటికీ దేశద్రోహమే. ఇలాంటి అపరిపక్వ, సంకుచిత, స్వార్థ రాజకీయ నేతల దుర్మార్గపు మాటలెలా ఉన్నా, వీటన్నిటికీ అతీతంగా సామాన్య ప్రజానీకం యొక్క ప్రతిస్పందన మాత్రం అమోఘం. అపూర్వం.

అంతేకాదు అమర జవానుల అంతిమ యాత్రలలో ఆ జవానులతో గాని, వారి కుటుంబ సభ్యులతో గాని కనీసం ముఖపరిచయం కూడా లేని సామాన్య ప్రజలు వందల, వేల సంఖ్యలో పాల్గొనడం ఒక గొప్ప విశేషం.

ఇది ఓ ఎత్తైతే ఉగ్రదాడిలో అశువులు బాసిన జవానుల తల్లిదండ్రులు తమ మిగిలిన సంతానాన్ని కూడా దేశసేవకై సైన్యంలోకే పంపిస్తామని చెప్పడం, వారి భార్యలు సైతం తమ సంతానాన్ని దేశ రక్షణకే పంపిస్తామని ప్రతినబూనడం అత్యంత ప్రేరణదాయకం.

**మమతా బెనర్జీ, చంద్రబాబు వంటి సీనియర్ రాజకీయ నాయకులు శత్రు దేశం పాకిస్థాన్ వాదనకు బలం చేకూర్చే విధంగా సరిగ్గా పాక్ ప్రధాని వాదననే వినిపిస్తూ ఉండడం బాధాకరం. వారి చర్య ముమ్మాటికీ దేశద్రోహమే.**

అంతేగాక వివిధరాష్ట్ర ప్రభుత్వాలు మొదలుకొని సెలబ్రిటీలు, వ్యాపారులు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు సైతం ఆయా కుటుంబాలకు ఆర్థిక చేయూత నందించటానికి ముందుకొ స్తూండటం సదా హర్షణీయం.

సూరత్‌కు చెందిన వజ్రాల వ్యాపారి హస్ముఖ్ భాయ్ సేథ్, అజయ్ సంఘ్వీ తమ పిల్లలకు ఘనంగా పెళ్లి చేశారు. అంతకంటే ఘనంగా రిసెప్షన్ నిర్వహించ తలపెట్టారు. ఇంతలో అనుకోకుండా జరిగిన ఉగ్రదాడితో రిసెప్షన్‌ను రద్దు చేసుకొని అందుకయ్యే ఖర్చును దాదాపు 16 లక్షల రూపాయలను అమర జవాన్ల కుటుంబాలకు సమర్పించారు. మాతా అమృతా నందమయి మృతుల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 5 లక్షల చొప్పున సాయాన్ని ప్రకటించారు. కర్నాటకకు చెందిన అమర జవాను గురు అంత్యక్రియలు జరపటానికి, సమాధి నిర్మించడానికి స్థలం లేదని వారి కుటుంబ సభ్యులు వ్యధ చెందుతున్న విషయాన్ని ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న సినీనటి సుమలత అంబరీష్ మండ్యలోని తన అర ఎకరా పొలాన్ని ఉచితంగా ఇస్తానని వాగ్దానం చేశారు. అలాగే రిలయన్స్ ఫౌండేషన్, సినీనటుడు అమితాబ్‌బచ్చన్, మరో సినీనటుడు అక్షయ్ కుమార్, మాజీ అంతర్జాతీయ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్, బాక్సర్ విజేంద్ర సింగ్, నిర్మాత రోనీ స్క్రూవాలా, ప్రముఖ నటుడు సల్మాన్ ఖాన్, గాయకుడు, నటుడు దిల్జిత్ దొసాన్జ్, గాయకుడు బాద్‌షా, నటీమణులు భూమి పట్నేకర్, తాప్సీ, కృతి సనన్ ఇలా ఎందరో ప్రముఖులతో పాటు సామాన్య వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు వీరు వారని తేడా లేకుండా దేశ రక్షా యజ్ఞంలో సమిధలుగా మారిన జవానుల కుటుంబాలకు తమ అండదండలందిస్తుండడం గర్వించ వలసిన విషయం.

అన్నిటికంటే ఎక్కువ ఆనందాన్ని కలిగించే విషయమేమిటంటే అజ్మీర్‌కు చెందిన ఒక బిచ్చగత్తె నందిని శర్మ తను యాచించి బ్యాంకులో దాచిన రూ.6.61 లక్షల రూపాయలు అమర జవాన్ల కుటుంబాలకు విరాళంగా ఇవ్వడం. ఆమె మరణానంతరం ఆమె కోరిక మేరకు ఆమె నామినీలు సదరు మొత్తాన్ని ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌కు అందించారు. మన దేశంలో అట్టడుగు స్థాయి వ్యక్తికి కూడా దేశం పట్ల ఉన్న భక్తి, శ్రద్ధ, నిబద్ధత భారతీయులందరికీ గర్వం కలిగించే విషయం కాక మరేమిటి?

" జాతస్య మరణం ధృవం" అన్నట్లుగా జన్మించిన ప్రతీజీవి మరణించక తప్పదు. అయితే జీవితంలో, జీవనంలో సఫలత సాధించి మరణిస్తే అది సంపూర్ణ జీవితమౌతుంది. అదే పదుగురి కోసం మరణిస్తే... దేశం కోసం మరణిస్తే... ఆ జీవితానికి సార్థకత లభిస్తుంది. ఆ జీవికి అమరత్వం సిద్ధిస్తుంది.

దేశ రక్షణలో అశువులు బాసి కోట్లాది ప్రజల అశ్రు ధారల నడుమ అమరపురికి పయనమైన నిస్వార్థ, నిష్కళంక యోధుల జన్మలు సార్థకం, అమరం, అఖిలం. వారి త్యాగం వృథా కారాదన్నదే కోట్లాది ప్రజల ఆకాంక్ష. ★

# కన్నుల పండువగా బాల మేళా - 2019

**విజ్ఞాన ప్రదర్శన:**

**17**/2/2019 ఆదివారం విజయవాడ మోఘల్రాజపురంలోని సిద్దార్థ అకాడమి ఆడిటోరియంలో " సేవా భారతి" అధ్వర్యంలో జరిగిన " బాల మేళా – 2019" సందర్భంగా విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. సేవా భారతి నిర్వహించు అభ్యాసికల(ఉచిత బోధనా తరగతుల)లో శిక్షణ పొందే చిన్నారులు స్వయంగా రూపొందించిన వివిధ రకాలయిన వైజ్ఞానిక కళాకృతుల ప్రదర్శన ఏర్పాటు చెయ్యబడినది. సందర్శకులు చిన్నారుల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు.

**సమ్మేళనం:**

అనంతరం జరిగిన సభా కార్య క్రమంలో శ్రీమతి డా॥చదలవాడ సుధ మాట్లాడుతూ భారతీయసంస్కృతీ సాంప్రదాయాలు అడుగంటిపోతున్న ఈ రోజులలో పిల్లలలో ఉత్తమ సంస్కారాలను, దేశభక్తిని, క్రమశిక్షణను,సృజనాత్మకతను పెంపొందిస్తున్న''సేవాభారతి'' కృషి అభినందనీయమని కొనియాడారు. డా॥ముక్కామల అప్పారావు మాట్లాడుతూ విజ్ఞాన ప్రదర్శనలోని ఎగ్జిబిట్స్ ను చూసి చిన్నారుల ప్రతిభకు ముగ్దుడనయ్యానని చెప్పారు. సేవా భారతి ఈ విధంగా చిన్నారుల ప్రతిభను వెలికి తీస్తూ వుండడం అభినందనీయమని తెలిపారు.

శ్రీ చింతా రవికుమార్ మాట్లాడుతూ మాతృ దేవోభవ, పితృ దేవోభవ, అతిథి దేవోభవ, ఆచార్య దేవోభవ అన్న పవిత్ర భావనను పిల్లలకు నేర్పాలని, చిన్న



వయసులో తగిన సంస్కారాలనందిస్తే పెద్దయ్యాక పిల్లలు ప్రయోజకులవుతారని, తల్లిదండ్రులకు, గురువులకు, దేశానికి మంచి పేరు తెస్తారని, పిల్లలలో అలాంటి సంస్కారాలను నింపడమే ధ్యేయంగా కృషి చేస్తున్న "సేవా భారతి" కార్యకలాపాలకు అందరూ చేయూతనివ్వాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న ఆరెస్సెస్ ఆంధ్ర ప్రాంత ప్రచారక్ శ్రీరాం భరత్ కుమార్ మాట్లాడుతూ పాలలో నెయ్యి దాగి ఉన్నట్లుగా పిల్లలలో ఉత్తమ సంస్కారాలు, ప్రతిభ, సృజనాత్మకత దాగి ఉంటాయని, పాలు కాచి, చల్లార్చి, తోడు పెట్టి, చిలికి, వెన్నతీసి నెయ్యి చేసినట్లుగా పిల్లలచే సాధన చేయించడం ద్వారానే వారిలోని సద్గుణాలు, సృజనాత్మకత వెలికి వస్తాయని తెలిపారు.

వ్యక్తిని తీర్చిదిద్దితే, వ్యక్తులను కలిపితే దేశం సహజంగానే సమగ్రతను సాధిస్తుందన్నదే సేవా భారతి, ఆరెస్సెస్‌ల విశ్వాసమని తెలిపారు. అందుకే చిన్నారులకు సరయిన దిశను చూపడం ద్వారా సాధారణ బాలకులను సైతం అసామాన్యమైన వ్యక్తులుగా, దేశభక్తులుగా తీర్చి దిద్దే కార్యాన్ని సేవా భారతి చేస్తున్నదని తెలిపారు. ఇలాంటి కార్యానికి కేవలం ధన సహాయం మాత్రమే చేస్తే సరిపోదని అందరూ తమ విలువైన సమయాన్ని సమర్పించడం ద్వారా సేవా భారతి కార్యక్రమాల విస్తృతికి దోహద పడాలని కోరారు. సేవా భారతి రాష్ట్రం మొత్తం మీద పదకొండు వందల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని తెలిపారు.

అనంతరం వివిధ అంశాలలో ప్రతిభ కనబరచిన అభ్యాసిక ప్రముఖ్ లు, చిన్నారుల తల్లులకు ముఖ్య అతిధులు బహుమతి ప్రదానం చేశారు. చివరిగా చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ★



ప్రేరణ

# రామకృష్ణ పరమహంస

**బె**ంగాలు ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన సిద్ధపురుషులలో ఒకరు రామకృష్ణపరమహంస. గృహస్తు అయి ఉండి కూడా బ్రహ్మచర్య దీక్షలో ఉండి భార్యను సాక్షాత్తు జగన్మాతగా ఆరాధించి వైరాగ్యాన్ని పొందిన సన్యాసి. మేధావి,తర్కశీలి అయిన వివేకానందుడితని శిష్యుడే. రామకృష్ణుడు ఫాల్గుణ మాస శుక్లపక్ష విదియ నాడు క్రీ.శ. 1836 ఫిబ్రవరి 18న క్షుధిరాముడు, చంద్రమణీదేవి దంపతులకు కామార్పుకూర్ గ్రామమున జన్మించాడు. జన్మనామము గదాధరుడు. ముద్దుగా గదాయ్ అని పిలిచేవారు. బాల్యం నుండే భగవద్భక్తిలో లీనమై ఉండేవారు. కోల్‌కతా సమీపంలో దక్షిణేశ్వరమున గల కాళికాదేవి మందిరంలో తన 17వ యేట పూజారిగా పనిచేయుచున్న గదాధరుని జీవితం నెమ్మది నెమ్మదిగా కాళీమయమైంది. కాళి భక్తునిగా మారిపోయాడు. సిద్ధపురుషుడైన తోతాపురి రామకృష్ణుని గురువు. తోతాపురి రామకృష్ణునకు వేదాంత సంబంధమైన జ్ఞానాన్ని ప్రసాదించి సన్యాస దీక్షనిచ్చాడు. రామకృష్ణుడు జ్ఞాన సాధనతోబాటు తాంత్రిక సాధన కూడా చేశాడు.

అప్పటి నుండే ఆయన పరమహంస అయి రామకృష్ణపరమహంసగా లోకప్రసిద్ధి చెందాడు. అనేక మంది మేధావులు దూరదేశాల నుండి కూడా వారి దర్శనానికై వస్తుండేవారు. వారి శిష్యులు రామకృష్ణ మిషన్ అనే పేరుతో ఒక సంస్థను ప్రాంభించి దాని ద్వారా వారి దివ్యోపదేశములను ఇప్పటికీ ప్రచారం చేస్తున్నారు.నిస్వార్థ భక్తితో దేవిని ఉపాసిస్తూ జగన్మాతను సాక్షాత్కరించుకున్న రామకృష్ణుడు ప్రతి మానవునిలో భగవంతుడున్నాడు కాబట్టి "మానవసేవే మాధవసేవ" అని బోధించారు. భగవంతుని సేవలో కాలం గడపమని, మనస్సును లగ్నం చేయమని, దుష్టులకు దూరంగా ఉండమని శిష్యులకు బోధించాడు. నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను సందేహాలను అందరికీ అనుభవంలోకి వచ్చేరీతిలో చిన్నచిన్న కథల రూపంలో నివృత్తి చేస్తుండేవారు. నేను–నాది అనే అహంకారపు తెరను తొలగించుకోమని చెప్పారు.1886 ఆగష్టు 16 న రామకృష్ణులు నిర్యాణం చెందారు. ★

## మూర్తీభవించిన వాత్సల్య మూర్తి శ్రీ పిళ్ళారామారావు

## సఫల సాధకుడు, ధన్య జీవి స్వర్గీయ శ్రీరామశాయి. - సంస్మరణ సభలో వక్తలు



సీనియర్ ఆరెస్సెస్ కార్యకర్త శ్రీ పిళ్ళా రామారావు మూర్తీభవించిన వాత్సల్య మూర్తి అని విశ్వ హిందూ పరిషత్ కేంద్ర కార్యాలయ కార్యదర్శి శ్రీ కోటేశ్వర శర్మ చెప్పారు. ఫిబ్రవరి 7న అయోధ్య నగర్ లోని హైందవిలో విశాఖ పట్టణానికి చెందిన సీనియర్ ఆరెస్సెస్ కార్యకర్త స్వర్గీయ పిళ్ళా రామారావు, విజయవాడకు చెందిన ఆరెస్సెస్, బీజేపీ కార్యకర్త స్వర్గీయ శ్రీరామశాయిల సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న వక్తలు స్వర్గీయ పిళ్ళా రామారావు, స్వర్గీయ శ్రీరామశాయిల సేవలను కొనియాడారు.

ఆరెస్సెస్ ప్రాంత ప్రచారక్ శ్రీ భరత్ కుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత అభిప్రాయాలకు కాక క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలుగా సంఘ ప్రయోజనాలు, అభిప్రాయాలకే వీరిరువురూ పెద్ద పీట వేశారని తెలిపారు. అలాంటి నిబద్ధత కలిగిన కార్యకర్తలను కోల్పోవటం దురదృష్టకరమని, వారిరువురి క్రమశిక్షణ, చిత్తశుద్ధి, నిబద్ధత అందరికీ ఆదర్శమని తెలిపారు.

మాజీ దేవాదాయ శాఖామాత్యులు, ఎమ్మెల్యే శ్రీ మాణిక్యాలరావు మాట్లాడుతూ తాను మంత్రిగా పని చేసే రోజులలో శ్రీరామశాయి గారు తనకు ఎన్నో అమూల్యమయిన సలహాలనిచ్చేవారని తెలిపారు.అలాంటి ఆత్మీయుణ్ణి, పిళ్ళా రామారావు వంటి సీనియర్ కార్యకర్తని కోల్పోవడం అత్యంత బాధాకరమని తెలిపారు.

సామాజిక సమరసతా వేదిక జాతీయ కన్వీనర్ శ్రీ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ శ్రీ పిళ్ళా రామారావు గారిది పరిపూర్ణ వ్యక్తిత్వమని, వారు సంపూర్ణ జీవితాన్ని గడిపారని తెలిపారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న శ్రీ రామారావు ఆంధ్రా యూనివర్సిటీ సెనేట్ మెంబెర్‌గా కూడా ఉండేవారని తెలిపారు. శ్రీ పిళ్ళా రామారావు హిందూ సమాజ పెద్దగా వ్యవహరించారని తెలిపారు.మీడియాతో మూడు దశాబ్దాల అనుబంధం కలిగిన శ్రీరామశాయి ఆరెస్సెస్ ప్రచార ప్రముఖ్ బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించారని తెలిపారు.భువనేశ్వరి పీఠాధిపతి శ్రీ సత్యానంద భారతీ స్వామి మాట్లాడుతూ స్నేహ శీలి, సౌమ్య మూర్తి అయిన శ్రీ పిళ్ళా రామారావు మృతి తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. రామశాయి గారున్నారన్న ధైర్యంతో తమ భువనేశ్వరీ పీఠంలో ఎన్నో భవిష్యత్తు కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించుకున్నామని వాటన్నిటినీ వమ్ము చేసి, మోసం చేసి శ్రీరామశాయి తమను వీడి పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. ★

---

## దెబ్బ అదిరింది, శత్రు శిబిరం చెదిరింది.

**శ్రీనగర్:** సింహం పంజా విసిరింది. పగ వాడికి తన అసలు దెబ్బ రుచి చూపింది. ఉరుము లేని పిడుగు లాగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ భూ భాగంలోని ఉగ్రవాదుల శిబిరాలపై విరుచుకు పడింది. భారత్–పాకిస్థాన్ సరిహద్దుల్లో వాస్తవాధీన రేఖ వెంబడి ఏళ్ల తరబడి ఉన్న ఉగ్రవాద శిబిరాలపై మనదేశ వైమానిక దళం మెరుపుదాడులకు దిగింది. మంగళవారం తెల్లవారు జామున 3:30గంటలకు ఈ దాడులు ఆరంభ మయ్యాయి.

**తురుపుముక్కతో దాడి..**


వైమానిక దళం తురుపు ముక్కగా భావించే షుమారు 12 మిరాజ్ యుద్ధ విమానాలతో దాడి చేశారు. ఉగ్ర వాద శిబిరాలపై సుమారు 1000 కేజీల పేలుడు పదార్థాలను జార విడిచారు. ఈ దాడులను రెండు దేశాల రక్షణ దళాలు ధృవీకరించాయి. తాము చేసిన దాడులు వందశాతం విజయవంతం అయ్యాయని వైమానిక దళ అధికారి ఒకరు ధృవీ కరించారు. భారత వైమానిక దళం దాడులు చేసిన విషయం నిజమేనంటూ పాక్ ఆర్మీ కూడా నిర్ధారించింది. వాస్త



వాధీన రేఖ వెంబడి ఉన్న బాలాకోట్, ఛకోటీ, ముజ్రఫాబాద్ లలోని ఉగ్రవాద శిబిరాలు ధ్వంసం అయ్యాయి. ★

## భారత వైమానికదాడులపై ఆరెస్సెస్ సర్ కార్యవాహ శ్రీ సురేష్ జోషి ప్రకటన

జైషే మొహమ్మద్ జరిపిన పుల్వామా ఉగ్రదాడిపై యావత్ భారత దేశంలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ రోజు భారత వైమానిక దళాలు పాకిస్థాన్ భూభాగంలోని జైషే మొహమ్మద్ స్థావరాలే లక్ష్యంగా దాడి చేసి విజయ వంతంగా పని ముగించుకొచ్చాయి.ఇది కోట్లాది భారతీయుల ఆకాంక్షలను



ప్రతిబింబించే చర్య. రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ భారత వైమానిక దళాన్ని మరియు భారత ప్రభుత్వాన్ని అభి నందిస్తున్నది. పాకిస్థాన్ సైన్యానికి గాని, పౌరులకు గాని ఎలాంటి నష్టమూ కలిగించకుండా కేవలం తీవ్రవాదులే లక్ష్యంగా సాగిన ఈ దాడులు మరొక్కసారి భారతీయ సాంస్కృతిక ఔన్నత్యాన్ని చాటుతున్నాయి. ★

## నెలకోపద్యం

**మఘువుడైననేమి మర్యాద యెరుగని
వారలేల తెలిసి గౌరవింత్రు
ఉరిమిమొరుగుకుక్క యోగి
నేమెరుగురా?
విశ్వదాభిరామ వినురవేమ**

**భావం:** మర్యాద తెలీని మూర్ఖులు దేవేంద్రుడే దిగివచ్చినా గౌరవించరు. యోగిని చూసిన కుక్క మొరుగుతుంది కానీ వారి ఔన్నత్యం దానికేమి తెలుస్తుంది?

## మంచిమాట



**మీ**కు మనశ్శాంతి కావాలంటే ఇతరులలో లోపాలను వెతకడం మానండి. బదులుగా మీ లోపాలేమిటో గుర్తించండి. ఈ ప్రపంచమే మీది అన్నంతగా సొంతం చేసుకోండి. అప్పుడు ఈ ప్రపంచంలో అంతా మీవారే అని గుర్తిస్తారు. **–శారదామాత**

## కలం నగారా

హిమ శైలం గర్విస్తోంది
మన సైన్యం గర్జిస్తోంది
ఆసేతు హిమాచల మొకటై,
రణ దుందుభి మ్రోగిస్తోంది.
**–కోర్సిపాటిబాలకృష్ణారెడ్డి,ఒంగోలు**

## పాఠకుల వేదిక

**పు**ల్వామా ఘటనపై పాక్ పలుకులనే పలుకుతున్న మమతా బెనర్జీ, చంద్రబాబు వంటి నేతల తీరు అభ్యంతరకరం. ప్రజలు ఓటు అనే అయుధంతో ఈ నేతల రాతలు మార్చాలి.

**–తొమ్మండ్రు సత్యనారాయణ, సత్తెనపల్లి.** ★

**పె**ద్దలు శ్రీరామశాయి గారు ఎప్పుడూ సరదాగా మాట్లాడుతూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండే మనిషి. పత్రికా రంగంతో వారిది మూడు దశాబ్దాల అనుబంధం. విజయవాడలో ఏ పనైనా, ఎంత పనైనా వారికప్పగిస్తే నిముషాల్లో జరిగిపోయేది. వారి హఠాన్మరణంతో ఆ లోటు పూడ్చలేనిదయ్యింది.

**–అనంతంసాయి, విజయవాడ** ★

## తల్లడిల్లిన తెలుగు నేల

ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో వీర మరణం పొందిన భారత సీఆర్ పీఎఫ్ జవాన్లను స్మరిస్తూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు నిరసన ప్రదర్శనలు, పాకిస్తాన్ దిష్టి బొమ్మల దహనం చేశారు. ప్రజలు అమర జవాన్లకు నివాళిగా మౌనం పాటించారు. దాడిలో గాయపడిన జవాన్లు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దేశ రక్షణలో ప్రాణాలను సైతం అర్పిస్తూ అమరులవుతున్న జవాన్ల త్యాగాలను గుర్తుచేసుకున్నారు. ★



**విశాఖలో**



**నెల్లూరులో**

### నెల్లూరులో ఆరెస్సెస్ తీర ప్రాంత కార్యకర్తల సమ్మేళనం



**24**/2/2019 ఆదివారం నెల్లూరులోని కస్తూరి దేవి గార్డెన్స్ నందు ఆరెస్సెస్ తీర ప్రాంత కార్యకర్తల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లాకు చెందిన తీర ప్రాంత గ్రామాల కార్యకర్తలు దాదాపు నాలుగు వందల మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 'సక్షం' సంస్థ అఖిల భారత సంఘటనా కార్యదర్శి శ్రీ సుకుమార్ జీ పాల్గొని మార్గదర్శనం చేశారు. అనంతరం నెల్లూరు పుర వీధులలో కార్యకర్తలు జరిపిన కవాతు ఎప్పటిలాగే ఉత్సాహంగా సాగింది. ★

### రాజమండ్రిలో సక్షం ఒకరోజు శిక్షణ వర్గ

**3**/ 2/ 2019 ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం



6 గంటల వరకు రాజమండ్రిలో సక్షం ఒక రోజు వర్గ జరిగింది. ఈ వర్గలో 50 మంది కార్యకర్తలు పాల్గొని వివిధ అంశాలలో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు బొమ్మూరు వద్ద గల మహారోగి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించే అవకాశం కలిగింది. తమకు సమీపంలోనే ఇంత గొప్ప సేవా కార్యక్రమం జరుగుతూ వుండడం మహదానందాన్ని కలిగించిందని కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సక్షం అధ్యక్షులు డా॥శ్రీమన్నారాయణ, ఆరెస్సెస్ విభాగ్ సంఘచాలక్ శ్రీ సుబ్బరాజు, విభాగ్ ప్రచారక్ శ్రీ లక్ష్మణ్, సక్షం జాతీయ కార్యవర్గ సభ్యురాలు శ్రీమతి ఉమాదేవి, కార్యదర్శి శ్రీ AVSNమూర్తి తదితరులు పాల్గొన్నారు. ★

## కళ్యాణం, కమనీయం..... ఎస్.ఎస్.ఎఫ్, తితిదే ల అధ్వర్యంలో వాడ వాడలా వేంకటేశుని కళ్యాణం..... పులకించిన జన మానసం.

**పిడికిట తలంబ్రాల పెండ్లి కూతురు**
**కొంత పెడమరలి నవ్వీనీ పెండ్లి కూతురు**
**పేరు గల జవరాలీ పెండ్లి కూతురు**
**పెద్ద పేరుల ముత్యాల మెడా పెండ్లి కూతురు**
**పేరంటాండ్ల నడిమీ పెండ్లి కూతురు**
**విభు పేరుజెవ్వ సిగ్గువడీ పెండ్లి కూతురు....**

చిరు నవ్వులు చిందిస్తూ పట్టు వస్త్రాలు ధరించి చలువ పందిరి క్రింద పెళ్లి పీటలెక్కాడు ఆ కొత్త పెళ్లి కొడుకు. ధగ ధగ మెరిసిపోతున్న బంగారు జరి అంచు చీరతో, ఓ పక్క ఆభరణాలు, మరో పక్క సిగ్గుల బరువుకి తల వాలి పోతుంటే నేల చూపులతో అడుగులో అడుగేసుకుంటూ నడచి వస్తున్నదదిగో నవ వధువు. పవిత్ర వేద మంత్రోచ్చాటన నడుమ కొంటె చూపుల కొండల రాయుడు ఆమె మెడలో మూడు ముళ్ళేశాడు. మంగళ వాయిద్యాలతో మండపం మార్మోగి పోయింది. ఏడ డుగులు నడిచి ఏడేడు జన్మాలు మనసున మనసై, అడుగున అడుగై కలసి నడుస్తామని అగ్ని సాక్షిగా ప్రమాణం చేసి, ముత్యాల తలంబ్రాలతో ఒక్కటైంది ఆ ముచ్చటైన జంట. ఆ జంటను చూసి ఊరు ఊరంతా మురిసిపోయింది. ఆ వరుడు వేంకటేశుడు. వధువు ఆకాశ రాజు కుమార్తె పద్మావతి.

ఆ అలమేలు మంగ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని ముంగిట సిగ్గుల మొగ్గ అయింది. ఆ ముసి ముసి నవ్వుల ముగురమ్మల మూల పుటమ్మను చూసి





ప్రతిపల్లె పరవశించింది. ఆ ఆది దంప తులకు వాడవాడలా జన నీరాజనాలు, మంగళహారతులు, మొక్కులు, నైవేద్యాలు. ఏడు కొండల పై కొలువుదీరి వున్న కొండల రాయడు తన దేవేరితో కలిసి ఏడు కొండలూ దిగి తెలుగు నాట పల్లె పల్లెనూ తన పవిత్ర పద స్పర్శతో పావనం చేస్తున్నాడు.

సమరసతా సేవా ఫౌండేషన్, తితిదేల సంయుక్త అధ్వర్యంలో తెలుగు నాట జరుగుతున్న శ్రీనివాస కళ్యాణాలతో పల్లె పల్లెనా కళ్యాణ శోభ కనిపిస్తోంది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 120 స్థలాల్లో శ్రీనివాస కళ్యాణాలు వైభవోపేతంగా జరిగాయి. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వెళితే గాని ఆ వెంకటేశ్వర స్వామి దర్శనం లభ్యం కాదు. అలాంటిది తమ ముంగిటే ఆ దేవదేవుని కళ్యాణం జరుగుతుండడంతో ప్రజలు ఆనంద పరవశులవుతున్నారు. భక్తితో ఆ స్వామి వారికి నైవేధ్యాలు సమర్పించు కుంటున్నారు.

సమరసతా సేవా ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీ త్రినాథ్ మాట్లాడుతూ భక్తి ద్వారానే వ్యక్తులలో సద్గుణ వికాసం జరుగుతుందని, అందుకే మన పూర్వీకులు భక్తి మార్గానికంతటి ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. పల్లె పల్లెకు, గుండె గుండెకు ఆ శ్రీనివాసుని చేరువ చేసి ప్రజలలో భక్తి, ధార్మిక భావనను జాగృతం చెయ్యడం ద్వారా వ్యక్తిగత, కౌటుంబిక, సామాజిక జీవన వికాసాన్ని సాధించదలచి ఎస్.ఎస్.ఎఫ్, తి.తి.దే తో కలిసి ఈ కార్య క్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు.

★





## కాశ్మీర్ కల్లోలానికి కారకులెవ్వరు?

**జ**మ్మూ కాశ్మీర్ లోని పుల్వామాలో తాజాగా ఉగ్రవాదులు పాశవిక దాడితో 40 మంది సి.ఆర్.పి.ఎఫ్ జవాన్లను బలిగొన్న నేపథ్యంలో ఆ ఘాతుకాన్ని నిరసిస్తూ భారతీయ విద్యా భవన్, మచిలీపట్నం "కాశ్మీర్ సమస్య – గతం, వర్తమానం" అనే అంశం మీద స్థానిక జిల్లా గ్రంథాలయ సమావేశ మందిరంలో సదస్సు నిర్వహించింది.

స్వతంత్ర భారతదేశ తొలితరం నాయకుల ఘోర తప్పిదాలకు గత ఏడు దశాబ్దాలుగా దేశం భారీ మూల్యం చెల్లిస్తూ వున్నదని, అందుకు సాక్ష్యం జమ్మూ కాశ్మీర్లో నేటికీ చెలరేగుతున్న హింసాకాండ, హత్యలేనని జమ్మూ కాశ్మీర్ అధ్యయన కేంద్రం సమన్వయకర్త డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు అన్నారు. ఆర్టికల్ 370 ద్వారా జమ్మూ కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం కాదని మనం అంగీకరించినట్లయ్యిందన్నారు. స్వయం ప్రతిపత్తి ఇచ్చి జమ్మూ కాశ్మీర్ లోకి మిగిలిన భారతీయులెవరూ ప్రవేశించే వీలు లేకుండా చేశారన్నారు. 370ఆర్టికల్ కారణంగా భారతీయులెవరూ ఆ రాష్ట్రంలో పౌరులవలేరని, ఆస్తులు కొనుక్కునేందుకు వీలు ఉండదని, సుప్రీమ్ కోర్టు తీర్పులు ఆ రాష్ట్రంలో వర్తించవని, అసలు భారత దేశానికి సంబంధించినవేవి జమ్మూ కాశ్మీర్‌కు వర్తించవని తెలిపారు. ఆర్టికల్ 370 ని అడ్డుపెట్టుకునే అక్కడ తీవ్రవాదులు చెలరేగిపోతున్నారని తెలిపారు.

జమ్మూకు చెందిన శ్రీమతి నీరూ మిశ్రా ఆ రాష్ట్రంలో ఆర్టికల్ 35[ఏ] వల్ల అక్కడ మహిళలు ఎదుర్కొంటున్న వివక్షను వివరించారు. జమ్మూ కాశ్మీర్ మహిళ మరో రాష్ట్రానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంటే ఆమెకు ఆ రాష్ట్రంలో ఎటువంటి హక్కులు ఉండవని, అదే కాశ్మీరీ పురుషుడు మరో రాష్ట్రం అమ్మాయిని వివాహం చేసుకుంటే ఆమెకు కలిగే సంతానానికి మాత్రం కాశ్మీర్ లో సర్వ హక్కులూ వున్నాయని తెలిపారు. అనంతరం పుల్వామా ఉగ్ర దాడిలో అసువులు బాసిన వీర సైనికుల మృతికి సంతాపంగా సభికులు మౌనం పాటించారు. చివరిగా భారతీయ విద్యాభవన్ కేంద్ర కార్యదర్శి డా॥ బి. సారంగపాణి వందన సమర్పణ గావించారు.

★

## సంఘ "కార్యకర్తల నిఘంటువు" స్వర్గీయ డాక్టర్ దెందుకూరి శివప్రసాద్

**కీ**.శే.మాననీయ శ్రీ దెందుకూరి శివప్రసాద్ గారు ఆరెస్సెస్ ఆంధ్ర ప్రాంత పూర్వ సంఘచాలకులు. వారి యొక్క ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈరోజు విశాఖపట్టణంలో వారి జీవిత విశేషాలతో



కూడిన '' కార్యకర్తల నిఘంటువు'' పుస్తకావిష్కరణ సభ జరిగింది. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ అఖిల భారత సహ సర్ కార్యవాహ మాననీయ శ్రీ భాగయ్య గారు ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమానికి విచ్చేసి పుస్తక ఆవిష్కరణ చేశారు . మాననీయ శ్రీ శివప్రసాద్ గారి జీవిత విశేషాలను శ్రీ భాగయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ పరివార్ క్షేత్ర ప్రముఖులు పాల్గొన్నారు. మన క్షేత్ర ప్రచారకులు శ్రీ శ్యాం జి, క్షేత్ర కార్యవాహ శ్రీ దూసిరామక ృష్ణ గారు, విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ కార్యదర్శి శ్రీ రాఘవులు గారు పాల్గొన్నారు. విశాఖ పట్నంలోని పలువురు ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్వర్గీయ శివ ప్రసాద్ గారి కుటుంబ సభ్యులు కచేరితో ప్రారంభించారు. వేదికపై స్వర్గీయ శివప్రసాద్ గారి పెద్ద కుమారుడు శ్రీ రామ కృష్ణ గారు, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డా॥ విజయగోపాల్ గారు ఆశీనులయ్యారు. స్వర్గీయ శివప్రసాద్ గారి రెండవ కుమారుడు శ్రీ సూర్య నారాయణ మూర్తి గారు వందన సమర్పణ గావించారు. ★

## జై భవాని... వీర శివాజీ



**ఫి**బ్రవరి18, ఉదయం 11 గంటలు, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, తెనాలి ..ఒక 13 ఏళ్ల బుడ్డోడు స్టేషన్‌లోకి వచ్చాడు. అక్కడున్న అధికారి వీడ్ని పట్టించు కోకుండా ఆయన పనిలో ఆయన మునిగిపోయాడు..సార్..నాకు పర్మిషన్ &సెక్యూరిటీ కావాలి అడిగాడు ఈ బుడ్డోడు.. ముందు ఆ అధికారికి అర్థం కాలా..''దేనికి సెక్యూరిటీ కావాలిరా?'' అని అడిగారు..''19 వ తారీఖు శివాజీ మహరాజ్ జయంతి. మా స్కూల్ పిల్లలం ఊరేగింపుగా వచ్చి శివాజీ మహరాజ్ విగ్రహానికి దండ వేస్తాం. దానికి పర్మిషన్ కావాలి''. ఆ అధికారికి విషయం అర్థం అయింది.వీడు మామూలోడు కాదు మొత్తానికి వీడి దగ్గర సరుకుంది అని. స్థానిక ఆరెస్సెస్ నాయకుడు శ్రీ అప్పారావు శ్రీనివాస రావు దగ్గరకు పిల్లాణ్ణి పంపారు..వీడు ఆయన దగ్గరకు వెళ్ళడమే ' అంకుల్ మీరు లెటర్ రాసిస్తే మా ఊరేగింపుకు పెర్మిషన్ ఇస్తారట ' వెంటనే రాసివ్వండి అని డిమాండ్...వాడితో అరగంట మాట్లాడితే అర్థం అయింది శ్రీనివాస రావు గారికి వీడు ఛత్రపతి అంశలో పుట్టాడని......వాడి పేరు కూడా శివాజీ మహరాజ్ అంత గంభీరమైనదే.. 'సమర్థ్'. 7వ తరగతి చదువు తున్నాడు..రేపు సాయంత్రం 4 గంటలకు సమర్థ్ నాయకత్వంలో శివాజీ మహరాజ్ జయంతి జరుపబోతున్నాం అని స్థానిక హిందూ సంస్థల కార్యకర్తలందరికీ కబురంపారు శ్రీనివాస రావు గారు.అనుకున్నట్టుగానే పాఠశాల బాల బాలికలు, స్థానిక హిందూ బంధువులందరూ పెద్ద ఎత్తున పాల్గొనగా అంగ రంగ వైభవంగా శివాజీ జయంతి ర్యాలీ, అనంతరం సభా కార్యక్రమం జరిగాయి. ★

## సక్షమ్ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ గురూజీ జయంతి

**వింజమూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా :**

ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఆరెస్సెస్ ద్వితీయ సర్ సంఘచాలక్ పరమ పూజనీయ శ్రీ మాధవరావు సదాశివరావు గోళ్వాల్కర్ (శ్రీ గురూజీ) ని స్మరించుకుంటూ సక్షమ్ అఖిల భారత స్థాయిలో నేత్రదాన వారోత్స వాలను నిర్వహిస్తున్నది. 19/02/2019న సక్షమ్ వింజమూరు, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వారి ఆధ్వర్యంలో శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో గురూజీ జయంతి ఉత్సవం జరిగింది.



ప్రధాన వక్త శ్రీ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పరమ పూజ్యనీయ శ్రీ గురూజీ గొప్ప దార్శనికులని, హిందూ సమాజంలో నెలకొన్న అనైక్యత, అంటరానితనం వంటి లోపాలను సరిదిద్దడానికి సకారాత్మక దిశలో కృషి చేశారని తెలిపారు. స్వతంత్ర భారత చరిత్రలో అత్యంత సంక్షోభ సమయం నడుస్తున్నప్పుడు ప.పూ. శ్రీ గురూజీ సంఘానికి నేతృత్వం వహించారని, 33 సంవత్సరాల పాటు వారి సమర్థ నేతృత్వంలో సంఘం దిన దిన ప్రవర్ధమాన మైందని తెలిపారు.శ్రీ గురూజీ దేశ విభజన, గాంధీజీ హత్య, రెండు సార్లు పాకిస్థాన్ యుద్ధం, చైనా యుద్ధం వంటి అనేక సంక్షుభిత సమయాల్లో దేశ నాయకత్వానికి, ప్రజలకు, హిందూ సమాజానికి, స్వయంసేవకులకు సరియైన మార్గదర్శనం చేశారని తెలిపారు. ★

## సంత్ రవిదాసు జయంతి సందర్భంగా చర్మకారులకు సన్మానం

**19**/2/2019 మంగళవారం సామాజిక సమరసతా వేదిక అధ్వర్యంలో నెల్లూరులోని జయభారత్ హాస్పిటల్ ప్రాంగణంలో సంత్ రవిదాసు జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న విశ్రాంత తపాలా సూపరింటెండెంట్ శ్రీ శివప్రసాద్ మాట్లాడుతూ చర్మకార కుటుంబంలో జన్మించిన సంత్ రవిదాసు హిందూ సమాజంలోని అసమానతలను తొలగించ డానికి కృషి చేశాడని తెలిపారు. రవిదాసు శ్రీకృష్ణునిపై అద్భుత రచనలు చేశారని శ్రీ శివప్రసాద్ తెలిపారు.

సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర నాయకులు శ్రీ కోడూరు సత్యం మాట్లాడుతూ సంత్ రవిదాసు సౌమ్య స్వభావము కలిగిన సాధు పురుషుడని



కొనియాడారు. ఆదిత్యా కళాశాల అధినేత ఆచార్య ఆదిత్య, జర్నలిస్ట్ శ్రీ జయప్రకాష్, సామాజిక సమరసతా వేదిక ప్రధాన కార్యదర్శి శ్రీ బూదూరు కేశవరాంలు మాట్లాడుతూ పుట్టిన కులం ఏదైనా వ్యక్తి ఉన్నతుడైతే ఆ వ్యక్తికి సముచిత గౌరవాన్ని ఇవ్వడానికి హిందూ సమాజం ఏనాడూ వెనుకంజ వెయ్యలేదనటానికి రవిదాసు జీవితమే ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా ఇందుకూరు పేట శ్రీ లలితా మహేశ్వరీ పీఠాధిపతి పూజ్యశ్రీ మహేశానంద, ఆచార్యఆదిత్యలు నగరంలోని కొందరు చర్మకారులను సత్కరించారు.

అలాగే సామాజిక సమరసతా వేదిక కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో చర్మకారులను కలిసి వారి స్థితిగతులపై సర్వే నిర్వహించి వారికి సంత్ రవిదాసు చిత్రపటాన్ని బహూకరించారు. ★

## మేరా భారత్ మహాన్.. పుల్వామా అమర వీరుల కుటుంబాలకు ఓ యాచకురాలు ఆరున్నర లక్షల సాయం



**స**మాజంలో తమకు గుర్తింపు లేకపోయినా.. దేశంపై బిక్షగాళ్లకు ఎంత భక్తి ఉందో తెలుపడానికి అజ్మీర్ కు చెందిన ఈ మహిళా యాచకురాలే గొప్ప ఉదాహరణ. ఆ యాచకురాలు రాజస్థాన్ లోని అజ్మీర్ కు చెందిన నందిని శర్మ. 2018 ఆగస్టులో నందిని చనిపోయింది. బతికినంత కాలం అజ్మీర్ లోని అంబేమాత దేవాలయం బయట నందిని బిక్షాటన చేస్తుండేది. ప్రతిరోజు బిక్షంగా వేసిన డబ్బులను తీసుకెళ్లి బ్యాంకులో సేవింగ్ చేస్తుండేది. తన మరణానంతరం ఆ డబ్బును అంబేమాత దేవాలయ ట్రస్టీలకు చెందేలా వారిని నామినీలుగా చేర్చింది. పుల్వామా ఉగ్రదాడి ఘటనలో అమరులైన జవాన్లకు ఈ సొమ్మును విరాళంగా ఇవ్వాలని ట్రస్టీలు నిర్ణయించుకున్నారు. జిల్లా అధికార కార్యాలయాన్ని సంప్రదించి అంతా వివరించారు. అమర వీరుల పేరిట రూ. 6.61 లక్షల సొమ్మును ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇవ్వాలనుకుంటున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించి లీగల్ సెల్ అన్ని ఫార్మాలిటీలను పూర్తి చేసింది. యాచకురాలు నందిని శర్మ విరాళంగా ఇచ్చిన సొమ్మును తీసుకొనేందుకు అంగీకరించింది. చనిపోయిన యాచకురాలు నందిని ఆత్మకు శాంతి చేకూరాలని అజ్మీర్‌లోని భక్తులంతా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ★


చందాదారులుగా చేరండి! చేర్పించండి
హిందూనగారా సంవత్సర చందా రూ. 50
మీతో పాటుగా మరి కొంతమందిని
చందాదారులుగా చేర్పించండి.
SBI PrajasakthiNagar, VJA
SB A/C No. 10032482732
IFSC Code : SBIN0007899
పంపవలసిన చిరునామా
మేనేజర్
**హిందూనగారా**
మాధవసదన్, కాళేశ్వరరావు రోడ్,
విజయవాడ–520002.



Postal Registration No:VJ/152/2017-19 RNI No. 52882/93
Date of Printing : 28-02-2019 - Date of Posting : 06-03-2019 - Pages:

Published by : Tulasi Surya Prakash, on behalf of Hindu Nagara and Printed at : Vanaja Graphics, 33-21-13/A, Chuttugunta, Vijayawada - 520 002. Printer & Editor : P.V.Sri Rama Sai., Cell : 9848076295. If undelivered please return to Madhavasadan, Kaleswara Rao Road, Governerpet, Vijayawada - 520002.